అని ఇచ్చాడు.

"ఏ. ఎం. రాజా పాడిన పాటలతో ఒక ఆడియో కేసెట్ వచ్చిందా? ఇన్నాళ్లకి ఎవరికో ఒక మంచి బుద్ధిపుట్టిందే!" అంటూ ఆ కేసెట్‌కున్న కాగితపు తొడుగు విప్పాను. (ఫ్లాప్ అనొచ్చు. కాని ఆమాటని "సినిమా ఫ్లాప్ అయింది" అనే వాక్యంలో ఉన్న ఫ్లాప్‌గా అర్థం చేసుకుంటారని "కాగితపు తొడుగు" అన్నాను.)

"పక్కయింటి అమ్మాయి, అమర సందేశం సినిమాల్లో పాటలు ఒకటికూడా చేర్చకుండా ఏ.ఎం. రాజా పాటల ఆడియో కేసెట్ తయారు చేసేరు. వీళ్లకి ఏదో ఎవార్డు ఇయ్యవలసిందే!' ' అన్నాడు మాబావ.

"ఇందులో అమర సందేశం సినిమాలోది ఒకపాట ఉందికదా?" అన్నాను. "బి" సైడు ఆఖరి పాటకిచ్చిన ఇండెక్సు చూపిస్తూ.

"ఇండెక్సులో అలాగే వేసేరు. మధుర మధుర - చిత్రం : అమర సందేశం; రచన : ఆరుద్ర; సంగీతం : ప్రసాదరావు. కేల్కర్ - అనీ. లోపల కేసెట్‌లో ఉన్నది మాత్రం ఆ పాట కాదు. మధుర మధుర మీ చల్లనిరేయి - 'విప్రనారాయణ' సినిమాలో పాట. 'మధురం, మధురం - మనోహం' - అని; అది వేరు."

"అయితే ఏంటంటావు?" అన్నాను.

"నిర్దేశించిన భావాలను వాక్యాలు బట్వాడా చెయ్యవు - అనే కాకుండా - ఉద్దేశించిన పాటలను యంత్రాలు రికార్డు చెయ్యవు - అని కూడా ఆరుద్ర గారు రాసుండవలసింది."

నేను కేసెట్ నెంబరూ అవీ రాసుకున్నాను. "హెచ్.ఎం.వి; ఎస్.పి.హెచ్.ఓ. "33218; ఎకానమీ; ఆర్.పి.జి. ఎంటర్‌ప్రైజెస్, వెల రు.22-00."

"ఎందుకవన్నీ రాసుకున్నావు; ఏదైనా కన్స్యూమర్ కౌన్సిల్‌కి రాస్తావా?" అని అడిగాడు మా బావ.

"కాదు. ఈ కేసెట్ కొనకుండా జాగ్రత్త పడదామని." ★

# 50. కొత్త సంవత్సరం - పన్ను బాధ

"వీడెవడో చూడు, ఏడాది తిరక్కుండా రెండు లక్షల రూపాయలు అప్పుతీర్చేడట!" అని మా ఆఫీసరు గారిచ్చిన కాగితం చదివేను. నిజమే. ఒక (జాతీయం చేయబడిన) బేంక్ మేనేజరు రాసేరు ఆ ఉత్తరం. దానికి జతపర్చి ఒక స్టేట్‌మెంటుంది. కె.వి. హరినారాయణరావు అనే ఆసామీ ఆ బేంక్‌లో 1991 జనవరిలో రెండు లక్షల రూపాయలు అప్పు తీసుకున్నాడు, ఇల్లు కట్టుకుంటానని. అప్పుకోసం దరఖాస్తు పెడితే బేంక్ వాళ్లు, ఆ స్థలం కొన్నప్పుడు హరినారాయణ రావుకి దఖలు పడిన దస్తావేజు, దానిమీద ఫలానా కొలతలతో ఇల్లు కట్టబోతున్నానని మున్సిపాలిటీకి సమర్పించిన ప్లాను (ఆమోదంతో సహా) ఇంకా ఇంకా న్యాయవాది అభిప్రాయం, ఇంజనీరు అభిప్రాయం, సబ్ రిజిస్ట్రారు అభిప్రాయం ఇలా ఏవేవో తాకట్టుగా పుచ్చుకుని, నాలుగు వాయిదాలలో అతనడిగిన రెండు లక్షల రూపాయలు అప్పూ

చెల్లించమని పై అధికార్లు ఇచ్చిన క్లియరెన్స్ మేరకి ఈ బేంకువాళ్లు ఆ అప్పు ఇచ్చేరు. అప్పు ఇవ్వడానికి పెట్టుకున్న షరతు ఏమిటంటే ఇల్లు కడుతున్న బేంకు ఇంజినీరు నిర్ధారణ పత్రాలు ఇస్తూ వుండడం; ఆ నిర్ధారణ పత్రాలు ఆధారంగా అప్పువాయిదాలు బేంకు నివాడా చెయ్యడం. అప్పు తీర్చడానికి పెట్టుకున్న షరతులేమిటంటే పధ్నాలుగు శాతం వడ్డీ, ప్రతి మూడేసి నెల్లకి ఒకసారి వడ్డీ అసలుకి కలపడం, మొత్తం అప్పు వడ్డీతో సహా పదేళ్ల లోపుగా తీర్చవలసి ఉండడం.

"అన్నీ కరెక్టుగా వున్నాయ్‌సార్", అని కాగితం మా ఆఫీసరు గారికి ఇచ్చేను.

"ఏడిసినట్టుంది తెలివి, పదేళ్లలోపుగా అప్పు తీరుస్తానన్నాడంటే ఏమిటి; ఈ హరి నారాయణరావుకి ఆదాయం ఏమీ లేదనే కదా, అర్థం! మరి అలాంటి వాడు ఒక్క ఏడాది కూడా గడవకుండా రెండు లక్షల అసలు, సుమారు పద్దెనిమిది వేల రూపాయలు - ప్లస్ అతని భుక్తీ రక్తీ ఎలా లేదన్నా ముప్ఫయ్‌వేలు - మొత్తం ఆ ఏడాది అతని రాబడి ఎంతన్నమాట? రెండు లక్షల యాభైవేలు. మరి అంత రాబడి మీదా పన్నుకట్టేడా అని ఎవరు చూడాలి; మనమే కదా! వెళ్లి పరిశోధించి రిపోర్టు తయారు చెయ్యి" అన్నారు మా ఆఫీసరు గారు.

"అయ్యో ఇదేం కలికాలం నాయనా? నేను బేంకిలో అప్పు తీసుకున్ననాటికి నా దగ్గిర పైసా లేని మాట నిజమే. కాని బేంకివాళ్లకి నేను రాసిచ్చిన కాగితంలో 'ఎలా తీరుస్తావు' అనే ప్రశ్నకి నేనిచ్చిన జవాబునువ్వు చూళ్లేదా బాబూ?" అన్నారు హరినారాయణ రావు.

ఆయన లోపలికెళ్లి తన అప్పు దరఖాస్తు కాగితం తాలూకు జిరాక్సు కాపీతెచ్చి చూపించేరు. "నేను కిందటి నెలలోనే రిటైరు అయ్యాను. కొన్ని కారణాలవల్ల నా తప్పంటూ ఏమీ లేకపోయినా నాకు మా ఆఫీసు వాళ్లు చెల్లించవలసిన ప్రావిడెంటు ఫండు, గ్రాట్యుటీ, పెన్షన్ (కొంత భాగం) అమ్మగా వచ్చే కమ్యుటేషన్ సొమ్ము నాకు వెంటనే చేతికి రావడం లేదు. కనుకనే ఈ లోనుకి లోనవుతున్నాను. ఆయా సొమ్ములు ఇప్పటినుంచి సుమారు మూడు నెల్ల అనంతరం ఒకటొకటిగా నాకు చెల్లించబడే అవకాశం ఉందని నేను భావిస్తున్నాను. అలా అవి చెల్లించడం మొదలైన నాటినుండి, ఏది ఎంత వస్తే అది అంతా కూడా నేను బేంకిలో నా అప్పు ఖాతాలో జమచేయగలవాడను" అని హామీలాగా, జవాబు లాగా హరినారాయణరావు వ్రాశారు.

"రాస్తే? అదంతా మీ ఆదాయం కాదేంటి; అదంతా మీ రాబడి అనిపించుకోదేంటి? మరి ఈ ఆదాయం మీద, ఈ రాబడిమీద పన్ను వెయ్యకపోతే మేం ఉద్యోగాలు చెయ్యడం ఎందుకు?" అని దబాయించి అడిగాను.

"నాయనా, నువ్వేదో సరాసరి నియామకం మీద ఉద్యోగంలో చేరినట్టున్నావు. ఇంకా కొన్ని రూల్సు చదువుకున్నట్టు లేదు. విను-రిటైరైన ఆసామీలకి ఆయా డిపార్టుమెంట్లుగాని ఆఫీసులు గాని చెల్లించే టెర్మినల్ బెనిఫిట్స్ - అనగా ప్రావిడెంటు ఫండు, పెన్షన్ కమ్యుటేషన్ డబ్బు, గ్రాట్యుటీ ఇటువంటివి ఒక్కసారిగా దొరికే పెద్ద మొత్తాలు అయినా అవి పన్ను చట్టం పరిధిలోకి రావు" అంటూ ఆయన మా ఆఫీసు పని నాకే నేర్పడం ప్రారంభించేడు.

కాఫీలు తాగడం అయ్యేక హరినారాయణ రావు గారు లేచాడు. "పద నాయనా; నీకు కావల్సింది పన్ను ఎగ్గొట్టే కేసులే కదా. నేను చూపిస్తాను కొన్ని కేసులు" అన్నాడు.

"అక్ఖర్లేదు లెండి. మా పనేదో మేం చేసుకుంటాం" అన్నాసరే ఆయన వదల్లేదు. "ఎంతో

దూరం వెళ్ళక్కర్లేదు. నీ స్కూటరు కూడా ఇక్కడే ఉంచెయ్యొచ్చు. దగ్గిరే'' అని నన్ను ఆప్యాయంగా భుజం మీద చేత్తో తట్టి లేపేడు. "నాకూ పన్లున్నాయి వాళ్లతో'' అన్నాడు.

"ఎటొచ్చీ వాళ్లదగ్గిరెక్కడా నువ్వు ఇన్కమ్ టేక్సు డిపార్టుమెంటు నుండి వచ్చేవని చెప్ప కుండా ఊరికే నాతో సాయం ఒచ్చినట్టుగా నటించు; అంతే''.

ఆ పొరుగునే ఒక డాక్టరుగారున్నారు. ముందు హాల్లో ఒక గుమస్తా తణికీకీ చికిత్సకీ వొచ్చిన వాళ్ల దగ్గిర మనిషికి వంద రూపాయలు చొప్పున పుచ్చుకుని చిన్న చీటిముక్క ఇస్తున్నాడు. డాక్టరు గారు లోపలినించి బెల్ కొట్టగానే ఒక్కొక్కరినీ లోపలికి వదుల్తున్నాడు. "ఇక్కడ రోజుకి నలభై మంది మొదటిసారిగా చెకింగుకి వస్తారు. ఇరవై మంది దాకా రెండోసారి మూడోసారి అలా. వస్తూనే ఉంటారు. మొదటిసారి వచ్చేవాళ్లు నూరేసి రూపాయలూ తరవాతొచ్చేవాళ్లు యాభయ్యేసి రూపాయలూ చెల్లిస్తారు. దేనికీ రసీదులు ఉండవు. సాయంకాలానికల్లా ప్రతీరోజూ ఆరు వేలు పోగవుతాయి. అంటే ఏడాదికి పద్దెనిమిది లక్షలు, నేను కట్టించుకున్న ఇల్లు లాంటివి తొమ్మిదేసి కట్టించవచ్చు. మళ్లీ వాటిమీద అద్దెలు వస్తాయి. అలా కూర్చో. డాక్టరుగారు నాకోసం బెల్లు కొట్టేరు.....''

తరవాత హరినారాయణ రావుగారు నన్ను ఆ పక్కవీధిలో ఒక హైకోర్టు అడ్వకేటు గారింటికి తీసికెళ్లేడు. "మా పల్లెటూరి పొలం కేసు సంగతి ఏమైంది ఆంజనేయులూ?'' అంటూ గుమస్తాని పలకరించేడు హరినారాయణ రావుగారు. అక్కడా డాక్టరు గారి ఆఫీసు లాగే వసూళ్లు అవుతున్నాయి. కేసుకి ఇంతా అనీ, వాయిదాకి ఇంతా అనీ రేట్లున్నాయి. దేనికీ రసీదులుండవు.

ఆ తరవాత ఒకరింటికి తీసికెళ్లేడు. "ఏమ్మా మనవరాలా!'' అంటూ ఆ ఇల్లాల్ని పలకరించేడు. ఆ ఇంటి యజమాని సబ్బు రిజిస్ట్రారుట. అంటే మార్కెట్లోకి ఏయే సబ్బులు విడుదల అవుతున్నాయో వాటి అమ్మకాలు ఎంతో రిజిస్ట్రేషన్ చేసే ఉద్యోగం కాదుట. ఆ ఇల్లాలు తన కష్టాలు చెప్పుకుంది. "కిందటి నెల్లో మా మామగారొచ్చి యాభై వేలు పట్టుకెళ్ళేరు. ఈ నెల్లో మా ఆడపడుచు పాతిక వేలకి టెండరు పెట్టింది. పైనెల్లో మా మరిదిగారికి ఉద్యోగం యివ్వడానికి ఎవరో మంత్రిగారికి, ఏకంగా లక్షరూపాయలు ఇవ్వాలిట. ఈయనగారు ఎంతగా రాత్రీ పగలూ పనిచేసినా నెలకి ముప్ఫయి వేలు దాటడం లేదు సంపాదన. ఇలా అయితే మేం కూడా అప్పులు చేసుకోవలసిందే'' అంటూ కళ్లనీళ్లు పెట్టుకుందావిడ.

"చూశావా నాయనా, ఎలాంటివాళ్లు ఎలా ఎలా సంపాదించుకుంటున్నారో? కొడితే ఏనుగు కుంభస్థలం కొట్టాలి సింహం. అంతేగాని గడ్డి కరవకూడదు. నువ్వింకా చిన్నవాడివి. జీవితంలో ఎన్నో నేర్చుకోవాలి'' అన్నాడు హరినారాయణ రావుగారు. మళ్లీ నన్ను వాళ్లింటికి నడిపించుకుని వెళ్తూ.

"మీరిక్కడే ఉండండి'' అని ఓ దగ్గిర ఆగేను. హరినారాయణ రావు గారు నిలబడ్డాడు. నేను ఎదురుగా "ప్రజా టెలిఫోను'' అని బోర్డు ఉన్న బడ్డీ చేరేను. మా ఆఫీసర్ గారికి ఫోన్ చేసేను. "మీరు వెంటనే రండి. నాకేమీ దిక్కు తోచడం లేదు'' అని గజేంద్ర మోక్షంలో ఏనుగులా ప్రార్థించేను. హరినారాయణ రావు గారి ఇంటి గుర్తులు చెప్పేను. "ఆయన కారులో వస్తారు. గప్‌చిప్‌గా డాక్టరు గారి క్లినిక్-కమ్-నివాసానికి పంపండి. ఇవాళ చావో రేవో తేలిపోవాలి'' అన్నాను

ఆవేశంగా.

మా ఆఫీసర్‌గారు వచ్చేసరికి నేను డాక్టరు గారి భవనంలో ముందు హాల్లో డబ్బులు వసూలు చేస్తున్న మనిషి దగ్గిర నిలబడి ఉన్నాను. "కదలకు. అదుగో మా ఆఫీసర్ గారు వచ్చేరు. ఇదంతా చెకింగు చేస్తారు" అన్నాను.

"నమస్కారం సార్. దయచెయ్యండి" అన్నాడు నేను పట్టుకోబోయిన మనిషి లేచి నిలబడి. "ఒక్క నిమిషం. డా(క్టరు)గార్ని తీసుకొస్తాను" అని మెరుపు వేగంతో టేబిలు సొరుగుకి తాళం బిగించి వెళ్లేడు.

"ఏంటీ, నువ్విక్కడున్నావు?" అన్నారు మా ఆఫీసరు గారు.

"పన్ను కట్టవలసిన వారు ఎక్కడుంటే మనం అక్కడుండాలి కదండి, సార్" అన్నాను.

"మతుండే మాట్లాడుతున్నావా; నువ్వు టెలిఫోన్ చేసినప్పుడే అనుకున్నాను. నీకేదో అయిందని! స్టుపిడ్!"

డాక్టరుగారు లోపల్నించి వచ్చేరు. నవ్వుతూ మా ఆఫీసర్ గార్ని సమీపించి "ఏంటిసార్, ఫోనైనా చెయ్యకుండా వచ్చేసేరు?" అని షేక్హాండ్ ఇచ్చేరు. "రండి లోపలికి. ఇవాళ ఎక్కువ మంది పేషెంట్సు లేరు."

"అబ్బే; ఊరికే ఈ దారంట పాస్ అవుతూ వచ్చాను. నేను రేపు ఊళ్లో ఉండను. విష్యూ హేపీ న్యూఫియర్ చెబుదామని!" అని మా ఆఫీసర్ గారు; డాక్టరు గారందించిన చేతిని వదల కుండా మరీ మరీ నొక్కుతూ అన్నారు. ఆ తరవాత "మా కొత్త ఇన్‌స్పెక్టరు" అని నన్ను పరిచయం చేసేరు.

కాసేపట్లో డాక్టరుగారూ, కాంపొండరు గారూ (బిల్లు కలెక్టర్‌గారూ) అందరూ మా కిద్దరికీ విష్యూ హేపీ న్యూ ఇయర్ చెప్పేరు.

"నువ్వింకా చాలా నేర్చుకోవాలి, రామలింగం! మనకి రాతమూలకంగా వచ్చే స్టేట్‌మెంట్లు ముఖ్యం. అంతేగాని చెప్పుడు మాటల్ని బట్టి మనం పనిచెయ్యం" అని నాకు శీతోపదేశం చేసేరు మా ఆఫీసరు గారు.

★

# 51. బోణీ

**ము**ప్పయి ఏళ్ల కిందట ఒకనాడు;

సాయంకాలం నేను ఇంటికి వచ్చేసరికి మా ఆవిడ "ఏంటలా ఉన్నారు?" అని పలక రించింది.

"ఎలా ఉన్నాను?"

"ఎలా వుండడమేమిటి; మొగుడుకొట్టేడా మొహం తీరే అంతా - అన్నట్టున్నారు - అదే చాలా డీలా పడిపోయి ఉన్నారు."

"పొద్దుట లేవగానే ఎవడిమొహం చూసేనోగాని ఇవాళ ఒక్కపనీ అవలేదు. వెళ్లినచోటల్లా